# దూలాలమీది దొడ్డరాజు

ఎండా కాలం. రాత్రి ఎనిమిది గంటల సమయం. రష్‌గా వున్న ఆ ఇరానీ రెస్టారెంట్‌లో దీపాలారిపోయాయి. ప్రాణం పోకడలా కరెంటెప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో 'దేవోనజానాతి, కుతోమనుష్యః' అన్న పరిస్థితి. పోయిన రెండు క్షణాల్లో మళ్ళీ కరెంటు వచ్చింది. దీపాలు వెలిగాయి. ఆ రెండు క్షణాల్లో జరిగిపోయింది ఘోరం. గోడ వారగావున్న టేబిల్‌దగ్గర కూర్చుని చాయ్ తాగుతున్నాడో వ్యక్తి. టేబిల్‌మీది కప్పు వలికి అతని చొక్కా పాడయింది. అతనికి కోపంవచ్చింది. ఎదుటి టేబిల్ దగ్గరున్న వ్యక్తితో మాట్లాడి చీకట్లో హోటల్ బయటకెళ్ళిన మనిషి చెయ్యి తగిలే టీ వలికిందని అతని ఉద్దేశం. లేచి వెళ్ళి, ఎదుటి టేబిల్ ముందు నిలబడ్డాడు.

''ఏడీవాడు?'' అనడిగాడు అతన్ని

''ఎవడువాడు?'' అర్థంకాక అడిగాడతను

''నాకప్పు తన్నేసి పోయినవాడు''

''ఎవడువాడు?''

''అదే నేనడిగేది?''

''నాకేం తెల్సు''

''నీకు తెలీకపోవటమేం ఇంత క్రితం నీతో మాట్లాడుతున్నాడుగా''

''నాతో ఎవరూ మాట్లాడలేదు''

''బూకరించకు. నేను చూడలేదనుకోకు''

''చూస్తే నన్నడుగుతావెందుకు?''

''నిన్నుకాక ఎవర్ని అడగాలి?''

''మధ్య నాకేం సంబంధం?''

''ఏం వాడు నీ బావమరదా? వత్తాసు వస్తున్నావు?''

''నా బావమరిది ఎవడూ లేడిక్కడ''

''మరింకేం ఎవడో చూపించు. వాటి తాట వలుస్తా''

''నాకు వాడెవడో తెలీదంటే నీకేం పిచ్చా''

''నాకు పిచ్చంటావా? నీకు పిచ్చి, నీయమ్మకు పిచ్చి, నీబాబుకుపిచ్చి, నీ అన్నకు పిచ్చి, నీ అక్కకు పిచ్చి...''

''ఓహో మీరందరూ ఒకేచోట వుండేవాళ్ళా? నువ్వెప్పుడు పారిపోయి వచ్చావు అక్కడనుండి?''

''ఎక్కడనుండి?''

''పిచ్చాసుపత్రి నుండి''

''ఓరి బద్మాష్! నేను పిచ్చాసుపత్రి నుండి వచ్చిన బాపతులా కనిపిస్తున్నానా?''

''మరి ఎవడో దిక్కుమాలిన వాడ్ని గురించి నన్ను ఆరా తీయటమెందుకు? నువ్వే బడా బడా బద్మాష్‌వి.''

''నన్ను తిడ్తావా గాడ్దీ! నీకసలు సభ్యతా సంస్కారాలు లేనట్టున్నాయి!''

''ఎవరికి లేవో కన్పిస్తూనే వుంది''

''మీరిద్దరూ అనవసరంగా కుక్కల్లా కొట్లాడుకోక విషయం ఏమిటో చెప్పండి. దోషి ఎవడో నేను నిర్ణయిస్తాను'' అన్నాడు అక్కడే చాయ్ తాగుతున్న మూడోవ్యక్తి.

''మమ్మల్ని కుక్కలంటావా, గాడ్దీ, పందీ, ఎద్దూ, దున్నపోతూ...చాలా?'' అడిగాడు మొదటివాడు, రెండోవాణ్ణి.

''చాలదు... పిల్లీ, ఎలుకా, పందికొక్కూ, కందిరీగా, దోమా, నల్లీ!'' అన్నాడు రెండోవాడు తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూ.

మూడోవాడు రెండోవాణ్ణి గిచ్చాడు.

''ఓర్నీయమ్మ కడుపుడకా! ఎంతగిచ్చావురా?''

''మరి కందిరీగలు, నల్లులు, దోమలు కుట్టవా?''

''నిన్నూ నల్లిలా నలిపిపారేస్తాను.''

''ఓర్నాయనో, ఈ లుచ్చా వెధవలిద్దరూ నా ప్రాణం తీస్తున్నార్రోయ్''

''వీడే అయ్యుండాలి నీకప్ తన్నింది''

''నాకప్పెందుకు తన్నావు బే''

''నేనెందుకు తన్నాను?''

''నువ్వే తన్నావు. నా చొక్కా ఖరాబయింది. దానికి ఈ పెద్ద మనిషే సాక్ష్యం.''

''మా బాగాదొరికాడు నీకు, పిల్లికి ఎలుక సాక్ష్యంలా''

''నేను పిల్లినా?''

''నన్నూ ఎలుకన్నాడు''

''పట్టుకో వెధవని, రెండు తగిలిస్తేగాని తప్పు ఒప్పుకోడు.''

''నువ్వటునుండిరా, నేనిటు కాస్తాను.''

''ఏవిటయ్యా మీకాకిగోల, ఎవరికీ ఏం తోచనివ్వకుండా'' అన్నాడు నాలుగో వ్యక్తి పక్క టేబిల్ నుండి.

''నీ పని నువ్వు చూసుకోబే!''

''అసలు విషయం నువ్వు గుర్తించలేదు బ్రదర్. మనం కాకులంట. ముగ్గుర్నీ అన్నావా కాకులవి!''

''అనుమానమేంలేదు. ముగ్గురూ కాకులే. ముక్కాకులు.''

''అవాకులు చెవాకులు పేలక, నాసంగతి తెలీదు నీకు.''

''ఏందోయ్ నీ సంగతి మహా''

''వుండు, ఈ సమోసాలు తిననీ నీ పనిచెప్తా''

''ఊ కానీ, నా కభ్యంతరంలేదు.''

''నే తినేదాకా ఆగటమెందుకు మీరిద్దరూ వాడిసంగతి తేల్చుకోవచ్చుకదా! మనం ముక్కాకులమట. రోషం, పౌరుషం లేదూ మీకు? తెలుగువాడి శౌర్య ప్రతాపాలేమయిపోయాయి.''

''నువ్వూ తెలుగువాడివేనా?''

''అచ్చం పదహారణాల తెలుగాడినే.''

''వీడు ఆంధ్రోడిలా వున్నాడు. అచ్చం పదహారణాల వాడు ఆంధ్రుడే.''

''నోర్ముయ్ మా రాయలసీమవాళ్ళు మాత్రం పదారణాల తెలుగువాళ్లుకాదా?''

''ఆమాటకొస్తే తెలంగాణోళ్ళం మాత్రం రూపాయికి వందపైసలూ తెలుగోళ్ళమే కల్ దార్ నహీఁ, హలీసిక్కా.''

''ఛట్ మీ తెలుగూ మీరూ? సగం ఉర్దూ కలుస్తుంది మీ మాటల్లో.''

''నీ మాటల్లో అరవం, కన్నడం పదాలు కలవ్వా?''

''అందుకనే నేనన్నది, మా ఆంధ్రా వాళ్ళ తెలుగు, పదహారణాల తెలుగని.''

''ఈ ఆంధ్రోళ్లు మన్ని దోచేస్తున్నారు.''

''అవున్నిజమే. సిక్స్‌పాయింట్ ఫార్ములా దోవదాన్లే. ఎక్కడ బట్టినా నౌకరీల్లో వీళ్లే.''

''పైగా మనం ముక్కాకులమట. వాడి సంగతి తేల్చుకోవాల్సిందే.''

''పోనీలే తెలుగోడే గందా. తెలుగోడన్న తరువాత, వాడికీ వుంటాయిగా పౌరుషం, అభిమానం.''

''మన్ని కాకులన్న తరువాత వాడు తెలుగువాడు కానీ, తమిళుడు కానీ, కన్నడిగుడుగానీ వాడి అంతు తేల్చాల్సిందే.''

''అవును ఆంధ్రోళ్ళ తర్వాత వాళ్లదే అన్ని చోట్లా డామినేషన్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్‌లో, సెంట్రల్ గవర్నమెంట్‌లో అన్నిట్లో వాళ్లే.''

''పౌరుషం, అభిమానం లేనివాళ్ళు. వాళ్ళదేశం వదిలి పెట్టి మనమీద పడి తింటున్నారు.''

''వై? ఈజ్ ఆంధ్రా యువర్ ఏన్సెస్ట్రల్ ప్రాపర్టీ, ఈజిట్ నాట్ పార్ట్ ఆఫ్ ఇండియా?'' అన్నాడు తమిళుడు.

''నమ్మవిషయదాగ మాతాడబేడ'' అన్నాడు కన్నడిగుడు.

''వక్కాం ఇల్లాదవాళ్ ఇంద తెలంగాళ్, అవర్ ఘల్ అవర్ఘళే అడిచి కిర్వార్ఘళ్''

''ఏమంటాడు వాడు. ళ్ళళ్.. అని బుడబుక్కల వాడి లాగు''

''సిగ్గులేదట మనకి''

''సిగ్గులేదా మనకి, అంతమాటన్నాడూ? ఆరుకోట్ల ఆంధ్రుల కవమానం.''

''ఏమయ్యా తెలుగోళ్ళకు సిగ్గులేదూ''

''ఇల్లే ఇల్లే.. ఇల్లెల్లే ఇల్లె.''

''వాడి జోలికిపోక, కరిచేస్తాడు. అసలే రావణాసురుడి సంతతి.''

''అయితే మనమేం తక్కువోళ్ళమా? మనది రామదండు''

''ఛ అదేంపేరు. రామదండు అంటే కోతులు కాదూ? రాముడికి సాయంచేసినవి కోతులు కాదూ? మనంకోతులమా? నేను ఛస్తే ఒప్పుకోనామాట.''

''రాముడు దేవుడు. ఆయనకు సాయం చేసిన వాటిని కోతులని అవమానించకూడదు మనం.''

''ఇదిగో నేను నాస్తికుణ్ని. నాకీ పుక్కిటి పురాణాలు చెప్పకు. రాముడు దేవుడా వాడికి కోతులు సాయం చెయ్యడమా?''

''రాములవారిని పట్టుకుని వాడూనీడూ అనకు''

''దేవుణ్ని వాడూ వీడూ అనడంలో తప్పులేదు లే.''

''ఆ మాటకొస్తే సినిమా ఏక్టర్లనూ, పొలిటీషియన్లను వాడూ వీడూ అంటాం. అంతమాత్రాన వాళ్లని అవమానించటమవుతుందా? యస్టీవోడు, ఏయన్నారోడు, వాడు బిజెపివోడు, వీడు కాంగ్రెస్‌వాడు, మరోడు తెలుగుదేశంవోడూ అని చెప్పుకోమా?''

''కమ్యూనిస్టు పేరెత్తవేం. నువ్వు కాంగ్రెస్ వాడివా?''

''నువ్వు కమ్యూనిస్టువా?''

''అవును ఏం తప్పా?''

''ఏం బ్రాండు కమ్యూనిస్టువి. రష్యా బ్రాండా, చైనా బ్రాండా?''

''వాడు బిజెపి వాడి లాగున్నాడు.''

''లాగేంటి? నేను బిజెపినే. అయితే ఏంటంటావు?''

''ఛ నీతో మాట్లాడకూడదు. మత మౌఢ్యం తలకెక్కిన వాళ్ళు మీరు.''

''మీరు తక్కువవాళ్లా? ఈ దేశం నీళ్లుతాగి, తిండితిని పరదేశాల మతాన్ని కీర్తించేవాళ్లు మీరు.''

''అంటే కమ్యూనిస్టులు దేశద్రోహులా? బూర్జువా వెధవా?''

''ఎందుకయ్యా కొట్టుకుంటారు? మన తెలుగోళ్లం. కలిసిమెలసి వుండాలి.''

''ఓరి నీ తెలుగు తెగులు తగలడా?''

''నీ పేరేంటి?''

''నీకెందుకు నాపేరు''

''సిఐడి లావున్నాడు మనిషి''

''పేరడిగితే సిఐడి అంటావేంది?''

''లేకపోతే నీకు నాపేరెందుకు?''

''మాటవరస కడిగాను. అదీతప్పే. పోన్లే చెప్పొద్దుగానీ, నలుగురం కలిశాం. స్నేహంగా చాయ్ తాగివెళ్దాం. అసలు చాయ్ తాగనేలేదు. వలికిపోయింది.''

''అరె కోన్‌హై భాయ్ ఇధర్ చార్ చాయ్ లావ్''

బేరర్ నాలుగు టీలు తెచ్చాడు. ''పైసలు సార్'' అన్నాడు.

''అరె. మేం పారిపోతున్నామా. ఇస్తాంలే.''

బేరర్ వెళ్ళిపోయాడు.

'ఛూ.. ఛూ...' అనుకుంటూ టేబిల్‌మీద గోడవారగా ఓ ఎలుక పరుగెత్తింది.

''ఇందాక అడిగావుగా ఎవడు వాడని వాడేనీడు.''

''ఎలుకా?''

''కాదు. దూలాలమీది దొడ్డ మారాజు''

''ఎక్స్‌ప్లాయిటర్. చీకటిలో మనుషులను దోచుకునే కాపిటలిస్టు.''

''కాదులేవయ్యా! ఆ టేబిల్‌చివర బ్రెడ్ ముక్క వుందికదా. దాన్ని అందుకోవటానికి పరుగెత్తింది. చీకట్లో నీకప్పు తన్నేసింది. 'నేరం నాదికాదు ఆకలిది' అన్నసినిమా వచ్చింది చూశావు అట్లా నేరం దాంది కాదు ఆకలిది.''

''దాన్ది కూడా మన ప్రొలెటేరియన్ క్లాసే నంటావా?''

''అమ్మా! ఇప్పటికి నీకు సరియైన వర్గ దృక్పథం ఏర్పడింది.''

మళ్ళీ కరెంట్ ఫెయిల్యూర్. టీ తాగి లేచాడు బిజెపి వ్యక్తి.

''మీరంతా కమ్యూనిస్టుల్లాగున్నారు. చాయ్ డబ్బు మీరే ఇచ్చుకోండి. నాకేం సంబంధంలేదు'' అని వెళ్ళిపోయాడతను.

''ఓరి వెధవా? నీ కసలు మానవత్వం లేదురా?''

''మీకూ నాకూ పడదు. మా రాజీవ్‌గాంధీని అస్తమానం తిట్టేవాళ్ళు. మీరే బిల్లుకట్టుకోండి'' అని లేచి వెళ్ళిపోయాడు మరొకతను.

''కాంగ్రెసోడూ పోయాడు, మనమూ పోదాం పదా గురూ'' బేరరొచ్చేలోపల ఇద్దరూ లేచి రెస్టారెంట్ బయటకొచ్చారు.

''ఏంది గురూ మంది సిపిఐయ్యా, సిపియమ్మా?''

''తెలుగుదేశం''.

''పోన్లే మిత్రపక్షమేగా. చూశావా, ఎక్కడ చూసినా దోపిడీ, దగా, మోసం, ఈ కాంగ్రెసోళ్ళను, బిజెపి వోళ్ళనూ నమ్మకూడదు.''

''బిజెపి వాడి సంగతి వేరులే.''

''సరేకాని నీ మాటెందుకు కాదనాలి'' అన్నాడు మిత్రపక్షి.

దూలాలమీది దొడ్డమారాజులు నల్గురూ ఎవరితోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

''బద్మాష్ కే బచ్చే! పైసే నైదియే వో లోగ్. చలేగయే. ఫిర్ క్యాకర్తా రహే రే హరాంఖోర్!''అని తిడ్తున్నాడు ఇరానీ హోటల్ వోనరు బేరర్ని.

'ఉదయం' నవతరం వారపత్రిక

9-3-1990